నమస్తే తెలంగాణ

కరీంనగర్

10 | కరీంనగర్, ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR


# రైతన్నను బతికించలేని కాంగ్రెస్‌కు అధికారం అవసరమా?

- రేవంత్‌రెడ్డి తలకాయలేని మాటలు బంద్ చేసి రైతులను ఆదుకోవాలి :ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, ఫిబ్రవరి 22 : ప్రజల ఓట్లతో గెలిచి, రైతన్నను బతికించలేని కాంగ్రెస్‌కు అధికారం అవసరమా? అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. యూరియా కోసం రైతుల క్యూలైన్‌లు, కొన్ని చోట్ల చెప్పులతో లైన్‌లు.. ఇలా రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిందని, వారి కష్టాలు చూస్తూ సర్కార్ మౌనంగా ఉంటున్నదని మండిపడ్డారు. మండలంలోని చల్లూరులో యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో పడిగాపులు కాస్తున్న పరిస్థితిని తెలుసుకున్న ఆయన స్పందించి మాట్లాడారు. యూరియా కోసం మళ్లీ పాత రోజులు గుర్తు చేస్తున్న దృశ్యాలు కంటికి కనబడుతున్నాయని తెలిపారు. పంట పండించే రైతన్నకు యూరియా దొరకడం లేదని, కేసీఆర్ నాయకత్వం లేకనే ఈ దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడైనా వచ్చిందా? ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి తలకాయలేని మాటలు బంద్ చేసి, మొదట రైతులను ఆదుకోవాలని హితవుపలికారు. రైతులకు సరిపడా యూరియా అందజేయాలని, అందరికీ రుణమాఫీ చేయాలని, రైతుబంధు ఇవ్వాలని, నాణ్యమైన విద్యుత్ అందజేయాలని డిమాండ్ చేశారు.



కాల్వలో మూసిన తూమును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

# శ్రీరాములపల్లి రైతులకు ఎల్లంపల్లి నీటిని అందించాలి


- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- మూసిన తూము పరిశీలన

కొడిమ్యాల, ఫిబ్రవరి 22 : కొడిమ్యాల మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి నీళ్లు రాకుండా మూసిన తూమును ఓపెన్ చేసి రైతులకు ఎల్లంపల్లి నీరు అందించి పంటలు కాపాడాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. శ్రీరాములపల్లికి ఎల్లంపల్లి నీరు రాకుండా మూసిన తూమును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు త్వరగా తూమును తెరిపించాలని కోరారు. గత పదేళ్లలో ఒక్క గుంట వరి ఎండకుండా ఎల్లంపల్లి నీటిని అందించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పంటలు ఎండుతున్నాయన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామ మైసమ్మ చెరువుకు నీటిని ఎత్తిపోసే పంపులు బంద్ అయ్యాయని, గతేడాది మాదిరిగా పంటలు ఎండుతాయనే అనుమానంతో రైతులు పొలాలలను కొంత బీడు ఉంచుకొని వరి వేసినట్లు చెప్పారు. తక్కువ పంటలకు నీళ్లు ఇచ్చే పరిస్థితిలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎండకాలంలోనూ నీళ్లు ఎక్కువగా ఉండి రైతులు వరి కోయడానికి చైన్ (పట్టాల) మిషన్‌ను వినియోగించే పరిస్థితి ఉండేదన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు నీళ్లు ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ మాజీ మెంబర్ బండపల్లి అంజన్‌కుమార్, ప్యాట అంజి, రైతులు తదితరులున్నారు.

# సార్లకు రూ.5 వేలు.. పట్టభద్రులకు రూ.3 వేలు

## నోట్లతో ఓట్లకు గాలం

- పెద్దల సభ ఎన్నికల్లో చిత్రాలే.. చిత్రాలు
- కరెన్సీ కట్టలతో దిగిన కార్పొరేట్ సంస్థలు
- సెలవులు పెట్టి మరీ పంపకంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు
- రెండ్రోజులుగా జిల్లాలోని పాఠశాలల్లో తిరుగుతూ డబ్బుల పంపిణీ
- ప్రతిరోజూ మందు, విందులే..
- ఎన్నికల్లో ఖర్చుల లెక్క చెప్పాలన్న నిబంధన లేకపోవడంతో విచ్చలవిడి వ్యవహారం
- చోద్యం చూస్తున్న అధికారులు



**పెద్దల సభ ఎన్నికల ప్రక్రియ కట్టుతప్పుతున్నది. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల అభ్యర్థులు రెండు నెలలుగా విస్తృతంగా చేసిన ప్రచారం, రూటు మారింది. మొన్నటి వరకు సభలు, సమావేశాలు, ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లను కలిసి చేసిన క్యాంపెయిన్ ప్రలోభాల పర్వంలోకి వెళ్లిపోయింది. ఓట్ల కోసం పలు కార్పొరేట్ సంస్థలు నోట్ల కట్టలతో దిగగా, డబ్బు, మద్యం ఏరులైపారుతున్నది. ప్రతిరోజూ మందు, విందుల జాతర నడుస్తున్నది. తమ మద్దతుదారులు గెలుపు కోసం పలు సార్ల సంఘాల నాయకులు పలువురు సెలవులు పెట్టి మరీ నోట్ల పంపకంలో బిజీ అయిపోయారు. అటు సార్ల ఓటుకు రూ.5వేలు పంపిణీ చేస్తుండగా, మరోవైపు ఓ పట్టభద్రుల అభ్యర్థి ఓటుకు రూ.3వేలు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తుండగా, తనిఖీలు చేసి పట్టుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తూ ఉండిపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.**

జగిత్యాల, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికలు ఈ నెల 27న జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గత రెండు నెలలుగా ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థులు తీవ్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ వస్తున్నారు. మొన్నటి వరకు సభలు, సమావేశాలు, ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లను కలిసి చేసిన ప్రచారం కాస్త భిన్నమైన రూపు తీసుకున్నది. మేధావులకు సంబంధించిన ఎగువ సభ ఎన్నికలైనా, రాజకీయ పార్టీలు (బీఆర్‌ఎస్ మినహా) తమ అభ్యర్థులను నిలబెట్టడం, నిలబెట్టిన అభ్యర్థులు సైతం కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో వేలాది కోట్లు సంపాదించిన వారు కావడంతో ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం తీవ్రస్థాయికి చేరుకున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఒక పార్టీ అభ్యర్థి కార్పొరేట్ కాలేజ్ యజమాని, తన కళాశాల సిబ్బందితో పాటు, ఇతరులను కలుపుకొని 400 బృందాలను తయారు చేసినట్లుగా తెలుస్తోంది. 400 బృందాలు ఎక్కడికక్కడ పట్టభద్రులను కలుస్తూ వారికి రూ.3వేల నుంచి రూ.5వేలు పంపిణీ చేయడంతో పాటు, మందు విందులు ఇస్తుండడం సర్వసాధారణమైంది. జగిత్యాల జిల్లాలో శుక్రవారం ఒక ప్రముఖ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉపాధ్యాయులు, ఉపన్యాసకులకు విందు ఏర్పాటు చేసిన వార్త ఉదయం నుంచే పట్టణంలో చక్కర్లు కొట్టడం మొదలైంది. మరో పార్టీ నిలబెట్టిన పట్టభద్రుల అభ్యర్థి ఓట్ల కొనుగోలుకు ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థితో కలిసి ముందుకు సాగుతున్నట్లు ఉపాధ్యాయవర్గాలు చెబుతున్నాయి. పట్టభద్రుల అభ్యర్థి ఓటుకు రూ.3వేలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి రంగంలోకి దిగిన ఒక పార్టీ అభ్యర్థి అయితే ఏకంగా ఓటుకు రూ.5వేలు చెల్లింపులు మొదలుబెట్టిన విషయం జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

### మందు, డబ్బు పంపిణీపై లేని పర్యవేక్షణ..

అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో డబ్బు, మందు, ఇతర సామగ్రి పంపిణీపై దృష్టిపెట్టి, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా చూడడం చాలా సర్వసాధారణమైన విషయం. ఎన్నికల సమయంలో ప్రతి సారి డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. మందు సీసాలు, చీరలు, క్రికెట్ బ్యాట్లు, గడియారాలు స్వాధీనం చేసుకున్న వార్తలు చూస్తూనే ఉంటాం. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు బాహాటంగా పంపిణీ జరుగుతున్నా, మందు విందులు ఎదురుగానే కనిపిస్తున్నా ఎలాంటి ఇబ్బందులు, రైడింగ్‌లు లేకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల నిబంధనల ప్రకారం అసెంబ్లీ, లోక్‌సభ, ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి బ్యాంకు ఖాతాను చూపించాలి. నిర్దేశిత మొత్తం కంటే అధికంగా వ్యయం చేయరాదు. సభలు, సమావేశాలు, పోస్టర్లు, చివరకు జెండాలకు, స్టిక్కర్లకు సైతం అయ్యే వ్యయాన్ని చూపించాలి. ఎన్నికల సమయంలో ఎవరూ రూ.50వేల కంటే ఎక్కువగా నగదు తరలించరాదు. అంతకు మించి డబ్బు ఉంటే, దానికి సంబంధించిన రసీదులు పూర్తిగా ఉండాలి. అలాగే వస్తువులు ఎక్కువ సంఖ్యలో తరలించడానికి వీలు లేదు. ఒక వ్యక్తి వద్ద మూడు ఫుల్ బాటిల్స్ కంటే అధికంగా ఉండడానికి వీలు లేదు. అలా ఉంటే కేసు అవుతుంది. ఇలా అనేక ఆంక్షలు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో డబ్బు వ్యయంపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడం పోటీ చేసే అభ్యర్థుల నెత్తిన పాలు పోసింది. మద్యం, డబ్బులు ఇష్టారాజ్యంగా, బాహాటంగానే తరలిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు, రెవెన్యూ ఏ విభాగం సైతం తనిఖీలు చేపట్టడం లేదు. యథేచ్ఛగా డబ్బుల రవాణా సాగిపోతూనే ఉంది. మందు విందులు, ఇతర తాయిళాలు తరలించబడుతూనే ఉన్నాయి. ఎమ్మెల్యే పదవితో సమానమైన (ఒకరకంగా చెప్పాలంటే అంత కంటే ఎక్కువ హోదా) ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి వ్యయ పరిమితి నిబంధన లేకపోవడం, డబ్బులు, మద్యం, ఇతర తాయిళాల పంపిణీపై నిఘా లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'పెద్దల సభ ఎన్నికలు. మేధావులు తప్పుడు విధానాలకు పాలుపడరు' అన్న నమ్మకంతో పూర్వకాలంలో నిబంధనలు రూపొందించి ఉండకపోవచ్చునని, కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో కచ్చితంగా టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు పాటించిన నిబంధనలనే పాటించాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

### సర్కార్, ప్రైవేట్ సార్లదే.. హవా..!

ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల పంపిణీ, మందు విందుల ఏర్పాటు విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, లెక్చరర్లే కీలక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి సంబంధించిన ప్రచారం విషయంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. విద్యా సంస్థల పనివేళల్లో ప్రచారం జరిగితే ఇబ్బంది ఉంటుందన్న ఉద్దేశంతో విద్యా సంస్థల్లో ప్రచారం చేయరాదన్న నిబంధనను ఎన్నికల సంఘం తెచ్చింది. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు పెద్ద ఇబ్బంది ఆరంభమైంది. అయితే దీన్ని అధిగమించేందుకు ఉపాధ్యాయులు కొత్త ఎత్తుగడ వేశారు. సంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయ నాయకులందరూ తమ అభ్యర్థుల కోసం విధులకు సెలవులు పెట్టారు. సెలవు పెట్టిన రోజులకు వేతనంతో పాటు, అభ్యర్థి పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. ఒక సంఘానికి చెందిన ఇద్దరు కీలక నాయకులకు రెండు కార్లు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాహాటంగానే చెబుతుండడం విశేషం. ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమకు ఉన్న పరిచయాలతో ఓటర్ల జాబితా ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు వెళ్లి తమ అభ్యర్థి తరఫున నేరుగా డబ్బుల పంపిణీ చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన యజమానులు ఎన్నికల బరిలోకి దిగడంతో ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన బోధకులు పెద్ద మొత్తంలో పట్టభద్రులను, ఉపాధ్యాయులను, లెక్చరర్లను సమీకరిస్తూ, డబ్బు పంపిణీ, మందు విందులను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి, పబ్లికేషన్లు నిర్వహించిన వ్యక్తి సైతం బరిలో నిలబడడంతో గతంలో అతడితో కలిసి పనిచేసిన లెక్చరర్లు, ప్రైవేట్ కాలేజీల యజమానులు ఆయన గెలుపు బాధ్యతను భుజానికి వేసుకొని, పంపిణీలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా ఎటూ చూసిన, ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్లే ఈ ఎన్నికల హడావిడిలో కీలక భూమిక పోషిస్తున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# రైతుల ఆక్రందనలు కనబడుతలేవా?

- వారిని ఆత్మహత్యలవైపు తీసుకుపోవడమే ఇందిరమ్మ రాజ్యామా!
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజం

మానకొండూర్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ సక్రమంగా అమలు కాక, 24 గంటల కరెంట్, సాగునీరు లేక, సకాలంలో ఎరువుల అందక రైతులు పడుతున్న అవేదనలు, చేస్తున్న ఆక్రందనలు కాంగ్రెస్ సర్కార్‌కు కనబడడం లేదా? అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిలదీశారు. శనివారం మానకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో రైతుల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అని భావించిన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఅర్ వారికోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రం నుంచే దేశానికి ఒక ఆదర్శ రైతును అందించిన చరిత్ర కేసీఆర్, బీఅర్‌ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు కష్టాలు మొదలయ్యాయని, కనీసం యూరియా అందించని నిస్సహాయస్థితిలో సర్కారు ఉందని విమర్శించారు. మళ్లీ రైతులను ఆత్మహత్యలవైపు తీసుకుపోవడమే ఇందిరమ్మ రాజ్యామా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి గోదావరి జలాలతో కేసీఆర్ తెలంగాణను సస్యశ్యామలం చేస్తే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలో లారీలను నింపి ఇసుక పంటలు పండిస్తున్నాడని ఎద్దేవా చేశారు. మానకొండూర్ నియోజకవర్గం చుట్టూ మానేరు ఉన్నా ఇక్కడి గ్రామాల రైతులకు సాగునీరందడం లేదన్నారు. గతంలో మూడు పంటలకు నీరందించిన సందర్భాలు ఉన్నాయని, ఇప్పుడు పంటలు ఎండిపోతున్నా ఎమ్మెల్యే కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల మీద ఉన్న ప్రేమ రైతుల సమస్యలపై ఎందుకు లేదని నిలదీశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెడుతారని తేల్చిచెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే రేవంత్‌సర్కార్‌కు పతనం తప్పదని, మానకొండూర్ నియోజకవర్గం నుంచే రైతులను ఏకంచేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీలు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు శాతరాజు యాదగిరి, రాచకట్ల వెంకటస్వామి, నెల్లి శంకర్, బోడ రాజశేఖర్, బొల్లం అనిల్ పాల్గొన్నారు.

# కుడికాల్వ పూర్తయ్యేదెన్నడో!

- నాడు పనులు ప్రారంభించి వదిలేసిన కాంగ్రెస్
- 17 కిలోమీటర్లు పూర్తి చేసిన బీఆర్‌ఎస్ సర్కారు
- మరో రెండు కిలోమీటర్లయితే పూర్తి
- అమలుకు నోచని కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నిర్మాణంలో జాప్యం
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు



అసంపూర్తిగా ఉన్న నారాయణపూర్ కుడికాల్వ

### నీళ్లు లేక ఎండిపోయినయ్

వరద కాల్వ నుంచి నిర్మించే సబ్ కెనాల్ మా భూమిల నుంచే పోతంది. 16 గుంటలు పోతున్నది. అధికారులు సర్వే కూడా చేసిన్రు. కానీ, పనులు చేస్తలేరు. నాకు ఏడెకరాల భూమి ఉంది. 20 గుంటల్లో నువ్వులు, 15 గుంటలల్ల గోధుమ, 16 గుంటల్లో పెసర, మూడెకరాల్లో పొలం వేసిన. నువ్వులు, గోధుమ, పెసర పంటలు నీరు లేక ఎండిపోయినయి. పొలం కూడా ఎండిపోవడానికి దగ్గరకు వచ్చింది. కుడికాలువ పూర్తైతదని ఏండ్ల సంది ఎదు రు చూస్తున్నం. కాలువ పూర్తయితేనే పంటలకు సాగు నీరందుతది.

– ఐతం తిరుపతి, రైతు (రంగరావుపల్లి)



**నారాయణపూర్ కుడికాల్వ నిర్మాణం కొసెల్లడం లేదు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అభ్యర్థి హామీ ఇచ్చినా ముందుకెళ్లలేదు. 19 కిలోమీటర్ల మేర కాలువ పనులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి వదిలేయగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 17 కిలోమీటర్లు పూర్తి చేసింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రాగా, మిగిలిన మరో రెండు కిలోమీటర్ల పనులు తాను గెలిస్తే పూర్తి చేస్తానని అప్పుడు మేడిపల్లి సత్యం హామీ ఇచ్చినా ఆచరణకు నోచలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. ఫలితంగా పరీవాహక ప్రాంతంలో నీరందక పంటలు ఎండుతుండగా, సర్కారు తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.**

గంగాధర, ఫిబ్రవరి 22 : ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి బోయినపల్లి మండలం స్తంభంపల్లి వరకు 19 కిలో మీటర్ల మేర కుడి కాలువ నిర్మాణాన్ని ప్రారంభించింది. కానీ, పనులపై అప్పటి పాలకుల వివక్ష కొనసాగింది. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దాదాపు 98 శాతం కాలువ పనులను పూర్తి చేసింది. 17 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కాగా, మరో 2 కిలో మీటర్లు మాత్రమే పెండింగ్‌లో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనుల్లో జాప్యం జరిగింది. ఆ సమయంలో కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అప్పటి చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేడిపల్లి సత్యం హామీ ఇచ్చినా పనులు మాత్రం ముందుకెళ్లలేదు. ఏడాదిన్నర కావొస్తున్నా నిర్మాణం పూర్తి కాలేదు. పనులు పూర్తి చేస్తే మధురానగర్, వెంకంపల్లి, కురిక్యాల, ఉప్పరమల్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తితో బోయినపల్లి మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశమున్నది.

### ఎండుతున్న పంటలు

కాల్వ నిర్మాణం పూర్తయితే భూగర్భ జలాలు పెరగడంతోపాటు పంటలకు సాగు నీరు అందుతుందన్న నమ్మకంతో ఆయా గ్రామాల్లో పరిధిలోని రైతులు కుడికాలువ, సబ్ కెనాల్స్ నిర్మాణం కోసం భూములను ఇచ్చారు. దాదాపు పదహారేండ్లు గడిచినా ప్రధాన కాలువతోపాటు ఉపకాలువల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పూర్తయితే చెరువులకు నీళ్లు వస్తాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, సాగునీటికి రందీ ఉండదని చెబుతున్నారు.



### పెట్టుబడి కూడా వచ్చేలా లేదు

నేను పదెకరాలు కౌలుకు తీసుకుని ఆరెకరాల్లో వరి, ఎకరం మక్క వేసిన. బావిలో నీరు లేక కంకిదశలో ఉన్న మక్కను గొర్రెలు, మేకల మేతకు వదిలేసిన. వరి పొలానికి నీళ్లందేలా లేవు. బావిలో ఉన్న కొద్దిపాటి నీటితోనే రోజు విడిచి రోజు వరుస తడులు పెట్టి కాపాడుకుంటున్న. ఒకవైపు నీరు పెడితే మరో వైపు ఎండుతున్నది. కౌలు కోసం ₹1.30 లక్షలు, పెట్టుబడి కోసం ₹1.20 లక్షలు ఖర్చు చేసిన. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. కుడి కాలువ వస్తేనే మా కష్టాలు తీరుతయి.

– ఎలవర్తి శ్రీనివాసరావు, కౌలు రైతు (రంగరావుపల్లి)



### బాయిల నీళ్లు అడుగంటినయ్

బాయిల నీళ్లు అడుగంటినయ్. వేసిన పంటలు ఎండి పోతున్నయి. మూడెకురాలల్ల పొలం, 20 గుంటలు శనిగె పంట వేసిన. నీళ్లు లేక శనిగె పంట వదిలేసిన. పొలానికి రోజు విడిచి రోజు తడులు పెడుతున్న. కింది మడికెల్లి నీళ్లు పెట్టే వరకు పైమడి ఎండిపోతంది. పెడ్డుబడి వచ్చేలా లేదు. ఏం చేసుడో అర్థమైతలేదు. కాలువ ఎప్పుడు పూర్తి చేస్తరో, ఎప్పుడు నీళ్లస్తయో తెలుస్త లేదు.

– ఐతం లచ్చయ్య, రైతు (రంగరావుపల్లి)


నేడు సాయంత్రం 4:00 గంటలకు

పట్టభద్రుల సింహ గర్జన

వేదిక మహాత్మా జ్యోతీరావ్ పూలే గ్రౌండ్ (సర్కస్ గ్రౌండ్), కరీంనగర్

ప్రశ్నించే గళం .. పరిష్కరించే గుణం..

ఆదిలాబాద్-కరీంనగర్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల MLC అభ్యర్థి

ప్రసన్న హరికృష్ణ గారికి

మొదటి(1) ప్రాధాన్యత ఓటు వేసి

భారీ మెజారిటీతో గెలిపిద్దాం ..

| క్రమ | అభ్యర్థి పేరు | అభ్యర్థి ఫోటో | ప్రాధాన్యత ఓటు |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | ప్రసన్న హరికృష్ణ Prasanna Harikrishna | | 1 |



తన 19 సం..రాల ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రుల సమస్యల సాధనకై వచ్చిన "ప్రసన్న హరికృష్ణ" గారిని భారీ మెజారిటీ తో గెలిపిద్దాం

పోలింగ్ తేదీ : 27-02-2025

రండి.. పోరాడుదాం ... భావితరాలకు సుస్థిరమైన సమాజాన్ని నిర్మిద్దాం .....